రేపే సర్టిఫికెట్ల పరిశీలన

- అనంతపురం పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లు సిద్ధం
- ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు కాల్‌లెటర్లు

(వివరాలు 6వ పేజీలో...)


హిందూపురంలో మండపానికి తరలి వెళ్తున్న గణనాథుడు

వచ్చేశాడు.. బొజ్జ గణపతి

- నేడు వినాయక చవితి పండుగ
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్లు

వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు సిద్ధమయ్యారు. మంటపాలు, ఇళ్లలో కొలువుదీర్చేందుకు స్వామివారి విగ్రహాలను కొనుగోలు చేసి తెచ్చారు. చాలామంది పర్యావరణహిత గణపతిని కొనేందుకు ఆసక్తి కనబరిచారు. పూజాసామగ్రి కొనేందుకు వచ్చినవారితో మార్కెట్‌లు రద్దీగా మారాయి. చెరుకు గడలు, పూలు, పండ్ల ధరలు భారీగా ఉండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జేబులు ఖాళీ అయ్యాయి.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం


హిందూపురం పూల మార్కెట్‌లో సందడి




ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

అందరికీ న్యాయం..

- త్రీమెన్ కమిటీ సభ్యులు రవినాయుడు, బాలవీరాంజనేయులు, అమర్‌నాథ్ రెడ్డి
- 30 ఏళ్లవారు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందటోళ్లు ఆరాటం: మంత్రి కేశవ్ (వివరాలు 6లో...)

28 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

అనంతపురం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎస్పీ జగదీష్ మంగళవారం తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా సోమవారం అటెస్టేషన్ ఫామ్స్ తీసుకుని, తిరిగి ఇచ్చిన వారికి వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా 6, 7, 8 కౌంటర్లలో హాజరైన వారు 28వ తేదీ, 1, 2, 9 కౌంటర్లలో హాజరైన వారు 29వ తేదీ, 3, 4, 5, 10 కౌంటర్లలో హాజరైన వారు 30వ తేదీ రావాలని సూచించారు. వైద్య పరీక్షల నిమిత్తం అభ్యర్థులు మెడికల్ బోర్డు ఫీజు రూ.500 వెంట తెచ్చుకుని, ఆసుపత్రిలో చెల్లించాలని సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లా సర్వజన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు.



కూరగాయలను ఎగుమతి చేయాలి: కలెక్టర్



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


తనకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి, ఈ ప్రాంతంలో పండించే కూరగాయలను ఎగుమతి చేసి, లాభాలు గడించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. మండలంలోని చిన్నరామన్నగారిపల్లి వద్ద ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో రైతు విజయ్‌కుమార్ రెడ్డి ఏర్పాటు చేసుకున్న షేడ్ నెట్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అందులో సాగుచేసిన కీర దోస పంటపై రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. 13 సెంట్లలో కీర పంట సాగుచేయడం ద్వారా రూ.80 వేల ఆదాయం పొందినట్లు రైతు చెప్పాడు. రైతు మరో ఎకరంలో షేడ్ నెట్ వేసుకోవడానికి సహకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం చౌడేశ్వరి రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో తనకల్లులో ఏర్పాటు చేసిన రైతు అంగడిని పరిశీలించారు. తనకల్లు వద్ద గోడౌన్లను పరిశీలించారు. తనకల్లులోని సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని ఆయన పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలపై రోగులను ఆరాతీశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎం రామమోహన్ పాల్గొన్నారు.




కన్నుల పండువగా ప్రాకారోత్సవం

కదిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభులకు వెండిరథం ప్రాకారోత్సవం నిర్వహించారు. వెండిరథం పై కొలువుదీరిన స్వామి వారికి సుగంధ పుష్పాల్పలతో, కదిరి మల్లెలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆస్థాన పూజలు నిర్వహించి, మంగళ వాయిద్యాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. పలు రకాల పండ్లను నివేదించి, భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. వేడుకలలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు






ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోండి

- శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ రత్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

హిందూపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. పరిగి రోడ్డులోని కల్యాణమండపంలో వినాయక విగ్రహాల కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదరహిత గణేష్ ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గత ఏడాది జరిగిన తప్పులను మండప నిర్వాహకులు ఈసారి చేయరాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 9వరోజు ఉదయం 10గంటల్లోపే విగ్రహాలు మండపాల నుంచి నిమజ్జనానికి తరలి వెళ్లాలన్నారు. ఉత్సవాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కార్యాలయం నుంచి మానిటరింగ్ చేస్తున్నారన్నారు. డీఎస్పీ మహేష్, మునిసిపల్ చైర్మన్ రమేష్‌లు మాట్లాడుతూ నిమజ్జనానికి హిందూపురం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వస్తారని, విగ్రహాలను మధ్యాహ్నాం 12గంటల్లోపే అంబేడ్కర్ సర్కిల్‌కు వచ్చేలా చూడాలన్నార. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, సీఐలు రాజగోపాల్‌నాయుడు, కరీం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జేపీకేరాము, రాఘవేంద్ర, నిమ్మకాయలరాము, రాయల్‌గోపాల్, జనార్దన్ పాల్గొన్నారు.













టీడీపీ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

వేదికపై ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, గుమ్మనూరు, అమిలినేని, శ్రావణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు



హాజరైన నేతలు

అందరికీ న్యాయం

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత గౌరవం

క్రమశిక్షణతో మెలగాలి

2029లో గెలుపే లక్ష్యం కావాలి

త్రీమెన్ కమిటీ సభ్యులు రవినాయుడు, బాలవీరాంజనేయులు, అమర్‌నాథ్ రెడ్డి

30 ఏళ్లవారు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందటోళ్లు ఆరాటం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీకి కష్టకాలంలో శ్రమించిన వారికి సముచిత గౌరవం ఉంటుందనీ, అన్ని కులాలు, నియోజకవర్గాలకు పార్టీ పదవుల్లో సమన్యాయం జరుగుతుందని పార్టీ పరిశీలకులు, త్రీమెన్ కమిటీ సభ్యులు రవినాయుడు, డోలా బాలవీరాంజనేయులు, అమర్‌నాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టి పెట్టారని తెలిపారు. పార్టీ పదవులు ఆశించే హక్కు అందరికీ ఉందనీ, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అందరికీ పార్టీ అధిష్ఠానం న్యాయం చేస్తుందన్నారు. 30 ఏళ్ల కిందట వచ్చిన వారు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందట వచ్చిన వారికి ఆరాటం ఎక్కువైందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ 70 శాతం పదవులు ఇచ్చారన్నారు. అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టీడీపీ అనంతపురం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. త్రిసభ్య సమిటీ సభ్యులు రాష్ట్ర సామాజిక, వికలాంగులు, పౌర సంక్షేమం, సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులు,



ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఇవి ప్రపోజల్స్ మాత్రమేననీ, పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ పదవుల్లో అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జితేంద్రగౌడ్, ఉన్నం హనుమంతరాయచౌదరి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, జేఎల్ మురళి, దేవళ్ల మురళి, జయరాంనాయుడు, గంపన్న, జిల్లా నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

మూడేళ్ల కిందట వచ్చినోళ్ల ఆరాటం

● పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి

నేను ఈ స్థాయికి రావడానికి 30 ఏళ్లు పట్టింది. నాతోపాటు ఇక్కడే ఉన్న అమర్‌నాథ్‌రెడ్డి కూడా సర్పంచ్ స్థాయి నుంచి వచ్చారు. 30 ఏళ్ల కిందట వచ్చిన వాళ్లు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందట వచ్చిన వారు ఆరాట పడుతున్నారు. ప్రతిపక్షంలో 5 ఏళ్లు కష్టపడిన వారిని పార్టీ అధిష్ఠానం తప్పక గుర్తిస్తుంది. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎవ్వరినీ మరచిపోలేదు. ఒకవైపు 10 లక్షల కోట్ల అప్పులు, జీతాలకే సరిపోయే ఆదాయం వచ్చే పరిస్థితులున్నా.. సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో శ్రమిస్తున్నారు. 16 వేల పైచిలుకు టీచర్ పోస్టులు, 64 లక్షల మందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేశారు. అనంతపురంలో సైతం వచ్చే మూడు, నాలుగేళ్లలో అన్ని ప్రాజక్టులు పూర్తయ్యేలా చూస్తాం. వచ్చేనెల 6న అనంతపురంలో నిర్వహించే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభకు సుమారు 2.50 లక్షల మందిని కలిపేలా ప్రణాళిక ఉంది. విజయవంతం చేసేందుకు అందరూ కలిసి అడుగేయాలి.

జిల్లాకు చాలా చేయాలనే యోచనలో పార్టీ



అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ సైతం జిల్లాకు చాలా చేయాలనే చేస్తోంది. ఎవరికైనా పార్టీ పదవులు ఆశించే అర్హత ఉంది. తాము పార్టీని ఏ విధంగా ఉపయోగపడతామో...ఎంత మేరకు అర్హులమో కూడా బేరీజు వేసుకోవాలి. అర్హులందరికీ అనుబంధ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో న్యాయం జరిగేలా, సముచిత స్థానం దక్కేలా చూస్తాం. కష్టకాలంలో కష్టపడిన వారికి, పోరాడిన వాళ్లను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గుర్తించి, తప్పక న్యాయం చేస్తారు.

- రవినాయుడు, శాప్ చైర్మన్

సమాన అవకాశాలు



పార్టీ పదవుల్లో అన్ని నియోజకవర్గాల నాయకులకు సమాన అవకాశాలు ఉంటాయి. సమాన ప్రాతినిధ్యం లభిస్తుంది. శ్రేణులను కుటుంబ సభ్యులుగా చూసే ఏకైక పార్టీ టీడీపీ. పార్టీ సంస్థాగత పటిష్ఠతపై అధిష్ఠానం దృష్టి పెట్టింది. అందరూ సహకరించాలి. 2029లో మళ్లీ అధికారం చేపట్టేలా శ్రేణులు కృషి చేయాలి.

- డోలా బాల వీరాంజనేయులు, మంత్రి

పారదర్శకంగా ఎన్నికలు



పార్టీలో పారదర్శకంగా ఎన్నికలు ఉంటాయి. పదవుల పంపకాల్లో అందరికీ అవకాశాలు కల్పించేలా టీడీపీ అధిష్ఠానం అడుగేస్తోంది. మీ విన్నపాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం. ప్రతిపక్షంలో ఉన్నపుడు టీడీపీ కోసం పోరాడి ఇబ్బందులు పడిన వారికి తప్పకుండా అవకాశాలు వస్తాయి. - అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిశీలకుడు

రేపే సర్టిఫికెట్ల పరిశీలన

● పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లు

● ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు కాల్ లెటర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 నియామకాలకు సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. డీఎస్సీ సెలెక్షన్ లిస్టు విడుదల ఆలస్యం కావడంతో ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన మూడు రోజులు వాయిదా పడింది. ఎంపిక జాబితా సిద్ధం కావడంతో ఈనెల 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు రాష్ట్రశాఖ నుంచి జాయింట్ డైరెక్టరు సుబ్బారావును స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఇక్కడకు పంపించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అనంతపురం శివారు, ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులందరూ గురువారం ఉదయం 9గంటలకు వెరిఫికేషన్ నిర్వహిస్తున్న పీవీకేకే కాలేజ్‌కు హాజరు కావాలని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం వెల్లడించారు.

19కి చేరిన కమిటీలు

ఉమ్మడి జిల్లాలో కలిపి 807 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించడానికి 16కమిటీల(ముగ్గురు సభ్యులతో)ను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీకి 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బాధ్యతలు అప్పగించాలని భావించారు. అయితే మోడల్‌స్కూల్స్‌కు సంబంధించిన పీజీటీ, టీజీటీ జోనల్ పోస్టులకు ఎవరైన జిల్లా అభ్యర్థులు ఎంపికై ఉన్నా ఇక్కడే వారి సర్టిఫికెట్లను పరిశీలించాలని రాష్ట్రశాఖ ఆదేశించింది. ఈనేపథ్యంలో పరిశీలనకు అదనంగా మరో మూడు కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. ఈ ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు, కమిటీలతోపాటు ఇతర లైన్ డిపార్టుమెంట్లతో కలెక్టరు వినోద్‌కుమార్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూతోపాటు వైద్యులు కూడా పరిశీలనకు హాజరుకావాలని ఆదేశించారు. బోగస్‌లకు అవకాశం లేకుండా పరిశీలన జరగాలని, పొరపాట్లు బయటపడితే అందుకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు ఉంటాయని కలెక్టరు హెచ్చరించారు.



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేడీ సుబ్బారెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

మేనేజ్‌మెంట్ల వారీగా టీచర్ పోస్టుల వివరాలు ఇలా..

సబ్జెక్టు	జడ్పీ మేనేజ్‌మెంట్	గవర్నమెంట్	మున్సిపాలిటీలు
ఎస్ఏ,తెలుగు	12	14	02
ఎస్ఏ ఉర్దూ	08	01	00
ఎస్ఏ హిందీ	23	03	02
ఎస్ఏ ఇంగ్లిష్	80	19	04
ఎస్ఏ గణితం	33	07	03
ఎస్ఏ ఫిజిక్స్	50	12	04
ఎస్ఏ బయాలజీ	54	16	0
ఎస్ఏ సోషియల్	98	08	04
సోషియల్ ఉర్దూ	00	01	00
ఎస్ఏ పీడీ	135	08	02
ఎస్జీటీ తెలుగు	41	09	97
ఎస్జీటీకన్నడ	07	00	00
ఎస్జీటీ ఉర్దూ	23	00	00

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

- అభ్యర్థుల విద్యార్హత ఒరిజనల్ సర్టిఫికెట్లు
- ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణపత్రం
- కాల్‌లెటర్‌లో సూచించిన మేరకు ఇతర సర్టిఫికెట్లు
- గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడుసెట్ల జిరాక్స్ కాపీలు
- కొత్తగా తీసుకున్న ఐదుపాస్ పోర్టు సైజ్ ఫొటోలు
- కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయం, వేదికకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. హాజరు కాకపోయినా,సర్టిఫికెట్లలో తేడాలొచ్చినా అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుంది. అలాంటి సమయంలో తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న మరో అభ్యర్థికి అవకాశం కల్పించి వెరిఫికేషన్‌కు పిలుస్తారు.
- అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిపికేషన్‌కు హాజరవ్వడాని కంటే ముందే సంబంధిత సర్టిఫికెట్లను వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ-2025 లాగిన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.

అర్హుల అవస్థలు

రీ వెరిఫికేషన్‌తో అర్హులకు అన్యాయం

● పింఛన్లు అందక దివ్యాంగుల లబోదిబో

● గత పాలకుల అక్రమాలతో ఇబ్బందులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'తమ వారికి' మేలు చేయడానికి గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి ప్రస్తుతం అర్హులకు అవస్థలు తెచ్చిపెట్టింది. తమ పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వైసీపీ నాయకులు సదరం సర్టిఫికెట్లను అడ్డం పెట్టుకున్నారు. స్లాట్ బుకింగ్, సదరం క్యాంప్ హాజరు, వికలత్వ పర్సంటేజ్ అన్నీ సజావుగా జరిగిపోయేలా గతంలో అధికారులను ఆదేశించారు. దీంతో అవయవాలన్నీ బాగున్న వారు కూడా సదరం సర్టిఫికెట్లను పొందారు. వీరికి వెంటనే పింఛన్లు మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పింఛన్ సొమ్ము భారీగా పెరగడంతో అనర్హుల ఏరివేతకు చర్యలు తీసుకుంది. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌ను ప్రారంభించింది. ఈ ఏరివేతలో కొందరు అర్హులైన దివ్యాంగుల పింఛన్‌ను కూడా ఆపేశారు. దీంతో వారు గత పాలకులు చేసిన పాపం తమకు శాపమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్ఎస్ ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు.



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, సంఘాల నాయకులు

శాఖల సమన్వయలోపం

విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్ఎస్ ఉన్నతాధికారుల సమన్వయలోపం వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటే ఆయ శాఖల పర్యవేక్షణలో పరిశీలన ప్రక్రియను చేపట్టాలన్నారు. సదరం స్లాట్ బుకింగ్, వికలత్వశాతం పరిశీలన క్యాంప్ డీసీఎహెచ్‌ఎస్ అధికారులు పర్యవేక్షణలో సాగుతోంది. డీఆర్‌డీఏ అధికారులు క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సదరం క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. సంక్షేమ అంశాలను డిజేబుల్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ నాలుగు శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ పక్కదారి పట్టిందని బాధితులు మండిపడుతున్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం

రీ వెరిఫికేషన్ ప్రక్రియ దళారులకు వరంగా మారింది. డీఆర్‌డీఏ, జీజీహెచ్, డీసీహెచ్‌ఎస్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది జేబులు నింపుకుంటున్నారని దివ్యాంగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అనర్హులకు వికలత్వ శాతం ఎక్కువగా చేపిస్తామని చెప్పి పాల్పడుతున్నారని మండిపడుతున్నాయి. సచివాలయం నుంచి నోటీసు అందుకున్న అనర్హులు రీవెరిఫికేషన్ క్యాంప్‌కు ఎలా వెళ్లాలి, క్యాంపులో డాక్టర్లుగా ఎవరుండాలి. దరఖాస్తులు తీసుకోవడం నుంచి భర్తీ చేసేంత వరకు ఏఏ సిబ్బంది పనిచేయాలి. తదితర రీవెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం ముందుగా ప్లానింగ్ చేస్తారు. ఆ మేరకు అనర్హులకు వెరిఫికేషన్ చేసి వికలత్వం ఉన్నట్లు పర్సెంటేజీలు వేస్తున్నారని దివ్యాంగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి.

మాకు అన్యాయం చేశారు



రీవెరిఫికేషన్ 'పేరుతో అర్హులమైన మాకు అధికారులు అన్యాయం చేశారు. వికలత్వంతో నేను ఎంత బాధపడుతున్నానో ఎదుటివారికి స్పష్టంగా కనిస్తున్నా అధికారులకు కనిపించకపోవడం అన్యాయం. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

-రమణ, బూదగవి, ఉరవకొండ మండలం

నలుగురు చేయి పట్టాల్సిందే



నలుగురు చేయపట్టనిదే ఇంట్లోనుంచి బయటకురాని పరిస్థితుల్లో బతుకున్నా. భార్య లక్ష్మీనరసమ్మ కూలి పనులు చేసి అన్నం పెడుతోంది. దగ్గరుండి ఇతరులు పర్యలు చేయకపోతే దుప్పట్లు తడిసిపోతాయి. అయినా రీవెరిఫికేషన్ చేయడం అన్యాయం కాదా?.

- నాగభూషణ, నాగిరెడ్డిపల్లి, అనంతపురం రూరల్ మండలం

ఇంటికొచ్చి పరిశీలించారు..



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డాక్టర్లు, అధికారులు ఇంటికొచ్చి పరిశీలించారు. నెలకు రూ.15వేల పింఛన్ మంజూరుచేశారు. అయితే రీవెరిఫికేషన్ 'పేరుతో నోటీసులు జారీచేసి మరోసారి సదరం క్యాంపునకు హాజరు కావాలన్నారు.

-బంగారమ్మ, తలుపూరు, ఆత్మకూరు మండలం

అధికారుల సమన్వయలోపం



విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్ఎస్ ఉన్నతాధికారుల సమన్వయలోపం వల్ల మాకు తీరని అన్యాయం జరుగుతోంది. గత ప్రభుత్వంలో అక్రమంగా సదరం సర్టిఫికెట్లను ఇచ్చారని, ఏరివేతలో అర్హులకు అన్యాయం చేయడం తగదు.

- నరసింహులు, ముక్తాపురం, కనగానపల్లి మండలం, ఏపీ ఎమ్మార్పీఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

2,269 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2,269 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను ఆయన పరిశీలించారు. జిల్లాకు 14-35-14 రకం ఎరువులు 1,111 మెట్రిక్ టన్నులు, 20-20-0-14 రకం 1,158 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. వాటిని ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

మరో 527 మందికి ఉచిత ప్రైవేటు విద్య

● ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద జిల్లాలో 527 మంది పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అవకాశం కల్పిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ మంగళవారం తెలిపారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు స్కూళ్లలో సీట్లు మిగిలిపోవడంతో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు మరో మారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ సీట్లకు సోమవారం ఎస్పీడీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో లాటరీ తీసి, విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. జిల్లాకు చెందిన మరో 527మంది పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించారన్నారు. ఎంపికైన విద్యార్థులందరూ తమకు కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 31వతేదీలోగా చేరిపోవాలనీ, లేకపోతే ఉచిత సీటు రద్దవుతుందని ఏపీసీ శైలజ తెలిపారు.

స్వర్ణ హోరు..!

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంత వాసికి రెండు బంగారు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన రేయాన్స్ రెడ్డి రెండు బంగారు పతకాలు సాధించాడు. కాకినాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో లోకేశ్ రెడ్డి, సుభాషిణి దంపతుల కుమారుడు రేయాన్స్‌రెడ్డి ప్రతిభ కనబరచి రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నాడు. విజేతతోపాటు కోచ్ అంజనేయులును పలువురు అభినందించారు.



పతకం సాధించిన రేయాన్స్‌రెడ్డితో తల్లిదండ్రులు, కోచ్

జాతీయ సదస్సుకు డ్వామా ఏపీడీ



సుధాకర్ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ జాతీయ సదస్సు డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి హాజరుకానున్నారు. వాటర్‌షెడ్ అభివృద్ధిలో ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ఈనెల 28, 29 తేదీల్లో ఢిల్లీలోని ఎన్‌ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్రం తరఫున జిల్లా వాటర్ షెడ్ విభాగ ఏపీడీ సుధాకర్ రెడ్డి ఎంపికయ్యారు. బుధవారం ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ పోస్టులకు జిల్లాలోని మాజీ సైనికులు, వితంతువులు, వీరనారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. నల్సా వీర్ పరివార్ సహాయత యోజన-2025 కింద ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో ఉచిత న్యాయసేవల క్లినిక్ ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో పారా లీగల్ వలంటీర్ పోస్టులకు డిగ్రీ చదివిన మాజీ సైనికులు, వితంతువులు, వీరనారులు, డిపెండెంట్స్ సెప్టెంబరు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కొవ్వూర్‌నగర్‌లోని జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో నేరుగాగానీ, 08554-241146 ఫోన్ నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం

తొలిరోజు 54 మందికి సీట్ల కేటాయింపు

అనంతపురం వైద్యం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నీట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 2025-26 విద్యాసంవత్సరం తొలిరోజైన మంగళశారం 54 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా తెలిపారు. అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్ నాయక్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఆలిండియా కోటా కింద ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి స్టేట్ కోటా అడ్మిషన్లు చేపట్టారు. 22 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు మెరిట్ మేరకు సీట్లు కేటాయించారు. అనంతరం 24 నుంచి 29వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. సోమవారమే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో అలాట్‌మెంట్ కార్డు డౌన్‌లోడ్ కాలేదు. దీంతో మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం వినాయక చవితి సెలవు అయినా కౌన్సెలింగ్ కొనసాగించనున్నట్లు అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు నీరజ, స్వాతి, లలిత భవాని, జగదీష్, ఏఓ చౌడేశ్వరి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నాయక్

సస్పెండైన స్థానంలోనే మరోసారి..!

● హిందూపురం సీటీఓగా క్రిష్ణవేణి

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం సీటీఓగా క్రిష్ణవేణిని ఆన్ డ్యూటీ మీద నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ రకాల ఆరోపణలతో సస్పెండైన నాలుగు నెలలకే ఆమె అదే స్థానంలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఉండే హిందూపురం పట్టణ పరిధిలో కొందరు జీఎస్టీ ఎగవేసి, జీరో వ్యాపారం చేశారు. గుజిరీ, ఐరన్, పట్టు చీరలు, వక్కలు, గుట్కా తదితరాల అక్రమ రవాణా జరిగింది. ఆ సమయంలో సీటీఓ క్రిష్ణవేణి, మరో ముగ్గురు డీసీటీఓలపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఒకరంటే ఒకరికి సరిపడక ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో విచారించిన ఉన్నతాధికారులు, ఈ ఏడాది ఫిబ్రవరి 25న నలుగురినీ సస్పెండ్ చేశారు. తిరిగి జూలై 4న డీసీటీఓలకు, 7న సీటీఓ క్రిష్ణవేణికి మరోచోట పోస్టింగ్ ఇచ్చారు. ఆ సమయంలోనూ పాత స్థానాలకే పోస్టింగ్‌లు తెచ్చుకోవాలని వారందరూ ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది.

సీటీఓ క్రిష్ణవేణిని కడప జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీటీఓగా నియమించారు. తాజాగా పాత స్థానంలోనే ఓడీపై నియమించారు. పన్నుల శాఖ ఉన్నతాధికారి నిజాయతీగా, ముక్కుసూటిగా వ్యవహరిస్తారని పేరుంది. కానీ ఈ వ్యవహారంతో పన్నుల శాఖలో చర్చ మొదలైంది. ఓ ముఖ్య ప్రజాప్రతినిధి పీఏ దీని వెనుక కీలకంగా పనిచేసినట్లు సమాచారం.

అవమాన భారంతో ఆత్మహత్య


గొల్ల లక్ష్మీనరసప్ప (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూగానిపల్లికి చెందిన గొల్ల లక్ష్మీనరసప్ప (43) అవమాన భారంతో మంగళవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనరసప్ప సోదరుడు తిరుపతిలో నివసిస్తున్నాడు. సోదరుడి కుమార్తెను బూగానిపల్లిలో తన వద్దే ఉంచుకుని, లక్ష్మీనరసప్ప చదివిస్తున్నాడు. అమ్మాయిని పోస్టల్ శాఖలో పనిచేస్తున్న మల్లాపల్లికి చెందిన మనోహర్ ప్రేమ పేరుతో వేధిస్తుండేవాడు. దీనిపై మనోహర్ కుటుంబ సభ్యులను లక్ష్మీనరసప్ప మందలించాడు. వారు లక్ష్మీనరసప్పను తీవ్రస్థాయిలో దూషించారు. దీంతో మనస్తాపం చెందిన అతడు గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక చింతచెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గుర్తించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. అతడికి భార్య రత్నమ్మ, కుమారుడు జగన్నాథ్, ప్రశాంత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మనోహర్‌పై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పెనుకొండ తరలించినట్లు సీఐ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

-ఆలస్యంగా వెలుగులోకి..

మడకశిర టౌన్, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన నల్లప్ప అనే దాదాపు 55 సంత్సరాలు పైబడిన వ్యక్తి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన మేరకు... ఈనెల 22న ఉదయం బాలిక బహిర్భూమికి వెళ్లగా నల్లప్ప ఆమెను పొదలోకి లాక్కెళ్లి అత్యాచారానికి యత్నించాడు. అతడి బారి నుంచి బాలిక తప్పించుకుని ఇంటికి వెళ్లి, తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో బాలిక తండ్రి పోలీసుల దృష్టికి ఈ సంఘటనను తీసుకెళ్లాడు. వారు స్పందించకపోవడంతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లాడు. వారు ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మడకశిర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సీఐ నాగేష్‌బాబును వివరణ కోరడానికి ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. కాగా బాలికపై అత్యాచారానికి యత్నించిన నల్లప్ప పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ముగ్గురిపై అక్రమ ఆయుధాల కేసు

బత్తలపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోయనపల్లి గ్రామంలో మూడురోజుల కిందట జరిగిన ఘర్షణలో ముగ్గురిపై అక్రమ ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ మంగళవారం తెలిపారు. మండలంలోని గంటాపురం జగ్గు అనుచరుడు కౌశిక్ వద్ద తుపాకీ దొరికిన విషయం తెలిసిందే. కౌశిక్‌ను విచారించగా బొగ్గులు కాల్చే వారి నుంచి విశ్వనాథ్ అనే టీడీపీ నాయకుడు డబ్బు వసూలు చేస్తున్నాడని, అతడిని బెదిరించి వాటా తీసుకోవాలని తనకు, సాంబాకు గంటాపురం జగ్గు చెప్పాడన్నారు. అందుకే తుపాకీ ఉంచుకున్నట్లు తెలిపాడు. దీంతో గంటాపురం, జగ్గు, కౌశిక్, సాంబాలపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపాడు. అలాగే కౌశిక్, సాంబాలపై దాడి చేసిన విశ్వనాథ్‌తో పాటు ఆయన అనుచరులు కళ్యాణ్, నరేంద్ర, రాజేష్‌చౌద రి, చంద్రలను కూడా కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలుకింద పడి యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండాపురం సమీపంలో రైలు కింద పడి మతీన్ బేగ్(33) అనే యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తుమకూరు జిల్లా సింగరగొంనహళ్లి గ్రామానికి చెందిన నయాజ్ బేగ్ కుమారుడని రైల్వే పోలీసులు తెలిపారు. కీమెన్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐపై కేసు నమోదు

గోరంట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోరంట్ల అప్‌గ్రేడ్ సీఐగా పనిచేసిన సుబ్బరాయుడుపై ఓ సివిల్ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని నల్లన్నపల్లికి చెందిన జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్పను అప్పటి సీఐ సుబ్బరాయుడు వైసీపీ నాయకుల ఒత్తిడితో స్టేషన్‌కు పిలిపించి, అసభ్య పదజాలంతో తీవ్రంగా అవమానించాడు. దీంతో సీఐ సివిల్ వ్యవహారంలో జోక్యం చేసుకుని, తన ప్రత్యర్థులతో కుమ్మక్కై తనను ఇబ్బంది పెట్టినట్లు లక్ష్మీనరసప్ప పెనుకొండ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు ఫిర్యాదు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేపట్టి, సీఐపై కేసు నమోదు చేశారు. ఆ సీఐ సుబ్బరాయుడు నవంబరు 13న కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు.

రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక


దత్తారెడ్డి


ప్రదీప్‌రెడ్డి


వినయ్‌ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీనియర్ క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు జిల్లాకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వినయ్‌ప్రసాద్, దత్తారెడ్డి, ప్రదీప్‌రెడ్డిని రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి విజయనగరంలో నిర్వహించనున్న మల్టీ డే మ్యాచ్‌లకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 742 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు తెలిపారు.

ఎంత అన్యాయం !

● పింఛన్ల తొలగింపుపై భగ్గుమన్న అర్హులు ● న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు

నల్లమాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడంపై ఆయా వర్గాలు భగ్గుమంటు న్నాయి. నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్ పొందుతున్న వారిని తొలగించడం సబబే కానీ, అర్హులకు అన్యాయం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండలంలో 251 దివ్యాంగుల పింఛన్లు తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. ఇందులో ఎముకల సమస్యలున్న వారు 177మంది, కంటి చూపు సమస్య ఉన్నవారు 26మంది, చెవి సమస్య ఉన్నవారు 33మంది, బుద్ధిమాంద్యం ఉన్న వారు 15మంది ఉన్నారు. వీరందరిని పింఛన్లకు అనర్హులుగా నిర్ధారించి, తొలగించడానికి నోటీసులు జారీచేశారు. వీరిలో అర్హులను కూడా తొలగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వీధిన పడుతున్న పరిస్థితి

ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో వైద్యంతో పాటు కుటుంబ పోషణ కూడా వీరికి జరిగిపోయేది. ప్రస్తుతం పింఛన్ తొలగించడంతో కుటుంబం వీధిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. లబ్ధిదారులు దివ్యాంగ సర్టిఫికెట్ల తీసుకువస్తే నల్లమాడ, కదిరి, హిందూపురం, అనంతపురం తదితర ఆసుపత్రులలో వెరిఫికేషన్ చేస్తామని సచివాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో లబ్ధిదారులు తగిన ధ్రువపత్రాలతో వెరిఫికేషన్‌కు వెళ్లారు. వైద్యులు వాటిని పరిశీలించి పంపారు. ఇది జరిగిన రెండు నెలల తరువాత మీకు వికలత్వం లేదన్న రీతిలో పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. దీంతో పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తొలగింపు నోటీసులు అందుకున్న వారు పునరుద్ధరణకు తగిన ధ్రువపత్రాలతో రావాలని అధికారులు తెలపడంతో వారంతా ఎంపీడీఓ కార్యాలయానికి క్యూ కట్టారు.

మరోసారి దరఖాస్తు చేసుకోండి: ఎంపీడీఓ ఆజాద్

మండలంలో 251మంది దివ్యాంగులకు పింఛన్ రద్దు అయినట్లు నోటీసులు ఇచ్చాం. నోటీసులు తీసుకున్న లబ్ధిదారులు మరోసారి వికలత్వం, ఆధార్, నోటీసు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకుంటే వారికి తేదీలిచ్చి, వైద్యులు సర్టిఫికెట్లు పరిశీలించి, అర్హులైనవారికి పింఛన్లు మంజూరు చేస్తారు.

జీవనం ఎలా?: గంగాదేవి, నల్లమాడ


మంచానికే పరిమితమైన దివ్యాంగురాలు గంగాదేవి

నేను నడవలేను, కూర్చోలేను. నాకు గత 15 సంవత్సరాలుగా పింఛన్ వస్తోంది. వికలత్వం గతంలో వైద్యులు 70శాతం వేశారు. రూ. ఆరువేలు పింఛన్ వస్తోంది. ఇటీవల అనంతపురం ఆసుపత్రికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రమ్మన్నారు. వెరిఫికేషన్‌లో పింఛన్లు పోయాయని తెలిసి, సచివాలయానికి వెళ్లగా, ప్రస్తుతానికి మీపేరులేదు, రెండో లిస్టు వస్తుంది. అప్పుడు చూస్తామంటున్నారు. అంతవరకు నా జీవనం ఎలా?

35 ఏళ్ల కిందటి నుంచి పింఛన్ తీసుకుంటున్నా



నాకు వికలత్వం 70శాతముంది. నేను 35 ఏళ్ల కిందటి నుంచి పింఛన్ తీసుకుంటున్నా. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వైద్యుల వద్దకు వెళ్లా. వాళ్లు దాన్ని చూసి పొమ్మన్నారు. తీరా ఇప్పుడు పింఛన్ తొలగించినట్లు నోటీసులు అందించారు. పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నా. నేనే ఏమీ పనిచేయలేను. ఉన్నతాధికారులు నా సమస్యను పరిశీలించి, పింఛన్ వచ్చేలా చూడాలి.

-నాగేంద్ర, నల్లమాడ

నోటీసు ఇవ్వడం ఏమిటో?



నాను 30 సంవత్సరాల నుంచి పింఛన్ తీసుకుంటున్నా. వైద్యులు నా సర్టిఫికెట్ పరిశీలించారు. తరువాత పింఛన్ రాదని నోటీసు వచ్చింది. పింఛన్ రాకపోతే ఎలా బతకాలో, ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అడిగితే, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

- శివకుమార్ నాయక్, నల్లమాడ

ప్రాణంతీసిన లైన్‌మన్ నిర్లక్ష్యం

-విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తనకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తిలిపల్లి గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో దినకూలీ మట్టమడుగు చంద్రశేఖర్ అలియాస్ చందు(35) మృతి చెందాడు. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు లైన్‌మన్ షఫీ వద్ద తనకల్లుకు చెందిన చందు దినసరి కూలీగా పని చేసేవాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఉస్తిలిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి ఏబీ ఫ్యూజులు వేయాలని తీసుకెళ్లాడు. అక్కడ ఫ్యూజులు వేయడానికి కొక్కంటి ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకోవాల్సి ఉండగా, లైన్‌మన్ నిర్లక్ష్యంగా వంకపల్లి ఫీడర్‌కు తీసుకున్నారు. ఇది తెలియని చందు ఎల్‌సీ తీసుకున్నారన్న ధైర్యంతో విద్యుత్ స్తంభం ఎక్కి ఫ్యూజులు వేయడానికి ప్రయత్నించాడు. ఎల్‌సీ తీసుకోని కారణంగా విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే మృతి చెందాడు. మృతుడి భార్య భార్య భవాని ఫిర్యాదు మేరకు తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, చందు మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మానసిక వేదనకు పరిహారం

వినియోగదారుల కమిషన్ తీర్పు

అనంతపురం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు పడిన మానసిక వేదనకు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారులు కమిషన్ స్పష్టం చేసింది. శింగనమలకు చెందిన బాధితుడికి రూ.20 వేలు చెల్లించాలని పేటీఎం నిర్వాహకులను ఆదేశిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. తన్వీర్ బాషా అనే యువకుడు పేటీఎం కంపెనీ నుంచి పేటీఎం సౌండ్ బాక్స్‌ను 2023 ఫిబ్రవరి 27వ తేదీ కొనుగోలు చేశాడు. ఆ తర్వాత దాన్ని డీ యాక్టివేట్ చేయాలని సదరు కంపెనీకి పలుమార్లు విన్నవించాడు. అయినా కంపెనీ స్పందించకుండా, నెల నెలా చార్జీలు విధించింది. గత ఏడాది అక్టోబరు 24న అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2480 తీసేసుకుంది. బాధితుడు పలుమార్లు కంపెనీ కస్టమర్ కేర్‌ను, గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత, కంపెనీ వైపు నుంచి నిర్లక్ష్యం, కస్టమర్లకు అందించే సేవల్లో లోపం ఉన్నట్లు కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్ తేల్చారు. పేటీఎం కంపెనీ బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి తీసుకున్న రూ.2480 మొత్తాన్ని 9శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించారు. బాధితుడి మానసిక వేదనకు రూ.20 వేలు, న్యాయపరమైన ఖర్చుల కోసం రూ.5 వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించాలని, ఆలస్యమైతే మరో 12 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

అవినీతి ప్రవాహం..!

సింగిల్ జాబ్‌కార్డులతో రూ.లక్షలు స్వాహా

విచారణ పేరుతో అధికారుల వసూళ్లపర్వం

సామాజిక తనిఖీ అధికారులపై దౌర్జన్యం

ఉపాధి పనుల్లో ఆగని అక్రమాలు



డ్వామా కార్యాలయం

పుట్టపర్తి టౌన్, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉపాధి పనుల్లో అవినీతి మాత్రం ఆగడం లేదు. నిరుపేద కూలీల కడుపు నింపాల్సిన ఉపాధి పథకం రాజకీయ నాయకులు, ఉపాధి సిబ్బంది, అధికారులకు కల్పవృక్షంగా మారింది. జిల్లాలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రిలో పలు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అక్రమాలపై విచారణ పేరుతో కాలయాపన చేసిన అధికారులు ఓ ఫీల్డు అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. పనులు చేయకున్నా, చేసినట్లు చూపించి, రూ.లక్షల ఉపాధి సొమ్ము స్వాహా చేసిన వారిని మాత్రం వదిలిపెట్టారు. తమ అవినీతి, అక్రమాలు బయటపడకుండా ఉండేందుకు రాజకీయ నాయకులతో చేతులు కలిపిన ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లు తమ అనుచరులతో ఉపాధి అధికారులు, రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం అధికారులపైనే దౌర్జాన్యాలకు దిగుతుండటం గమనార్హం.

రూ.లక్షలు స్వాహా

సాధారణంగా రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యులను ప్రాణికంగా తీసుకుని అందరికి కలిపి ఒక జాబ్‌కార్డు ఇస్తారు. ఒంటరి మహిళలు, పురుషులకు సింగల్ జాబ్‌కార్డులు ఇస్తారు. జిల్లాలోని అనేక మండలాల్లో ఒక రేషన్‌కార్డులో నలుగురు కుటుంబ సభ్యులున్నా, విడివిడిగా జాబ్‌కార్డులు జారీ చేసి, వారు పనికి రాకున్నా వచ్చినట్లు బిల్లులు పెట్టి ప్రతినెలా రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ఒకే కుటుంబంలోని వారికి విడిగా జాబ్‌కార్డు ఇవ్వకూడదన్న నిబంధనలు లేవంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆ అధికారి కనుసన్నల్లోనే...

ఉపాధి పథకంలో కీలకంగా వ్యవహరించే ఓ జిల్లా అధికారి కనుసన్నల్లోనే అవినీతి దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఉపాధి పనుల్లో ఆయనకు తెలియకుండా ఏపని జరగదు. క్షేత్రస్థాయిలోని టెక్నికల్, ఫీల్డు అసిస్టెంటు, ఉపాధి సిబ్బంది అక్రమాలే ఆ అధికారికి కాసుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. పైకి నిజాయతీ పరుడినని ఢాంబికాలు పలికే ఆయన అక్రమాలకు పాల్పడ్డ వారి నుంచి భారీ మొత్తంలో డబ్బులు గుంజుతు న్నట్లు తెలిసింది. ఉపాధి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతున్నట్లు తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తుంటారు. పత్రికల్లో వార్తలు వచ్చిన తరువాత విచారణ పేరుతో ఉద్యోగులను హడలెత్తించడం, అందినకాడికి దండుకోవడం ఈ అధికారికి సర్వసాధారణమనే ఆరోపణలున్నాయి. ప్రతినెలా ఒక మండలం నుంచి నిర్ణీత మొత్తం ఈ అధికారి నిర్ణయించిన విధంగా రావాల్సిందే. ఈమామూళ్ల వసూళ్లకోసం తనకు అనుకూలమైన అధికారులను బృందంగా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ అధికారి అవినీతి బాగోతంపై రాష్ట్రాధికారులు దృష్టి సారించడంతో జిల్లా వదిలి వెళ్లడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.


వెంగళమ్మచెరువులో సామాజిక తనిఖీ దృశ్యం (ఫైల్)

సామాజిక తనిఖీ బృందంపై దౌర్జన్యం

తమ అవినీతి అక్రమాలు సామాజిక తనిఖీలో బయటపడతాన్న భయంతో తనిఖీలకు వచ్చిన అధికారుల బృందాలపైనే దౌర్జన్యాలకు దిగుతున్నారు. గత కొద్దిరోజులుగా జిల్లాలోని పుట్టపర్తి, నల్లమాడ మండలాల్లో రాష్ట్రస్థాయి బృందం సామాజిక తనిఖీలు జరుపుతోంది. ఇందులో భాగంగా గ్రామాల్లోకి వెళ్లి ఉపాధి పనులు గురించి గ్రామసభ నిర్వహించి ప్రజలు, కూలీల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. పనులకు వెళ్లకున్నా, వెళ్లినట్లు బిల్లులు చేసిన వ్యవహారంపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఈబృందం రెండురోజుల కిందట పుట్టపర్తి మండలంలోని ఓగ్రామంలో సామాజిక తనిఖీ కోసం గ్రామసభ నిర్వహించింది. ఈ సమయంలో తమ అవినీతి బాగోతం బయటపడుతుందన్న భయంతో కొంతమంది రాజకీయ నాయకులు, ఉపాధి సిబ్బంది కొందరిని రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించారు. తనిఖీ బృందం సభ్యులపై దౌర్జాన్యానికి దిగారు. తనిఖీలు చేయడానికి మీరెవరంటూ బృందం సభ్యులను బూతులు తిట్టినట్లు తెలిసింది. దీంతో భయపడిన సామాజిక సంఘం సభ్యులు అక్కడనుంచి వెనుతిరిగినట్లు సమాచారం.

సింగిల్ జాబ్‌కార్డులు ఇవ్వకూడదు

ఒకే రేషన్‌కార్డులో కుటుంబ సభ్యులకు విడివిడిగా జాబ్‌కార్డులు ఇవ్వకూడదు, రేషన్‌కార్డు నుంచి విడిపోయినా, ఒంటరిగా ఉన్నవారికి మాత్రమే విడిగా జాబ్‌కార్డు ఇస్తాం. ఒకే కుటుంబంలో ఉండి సింగల్ జాబ్‌కార్డు పొందిన విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

-శ్రీలక్ష్మి, డ్వామా ఇన్‌చార్జి పీడీ

ముగిసిన శిక్షణ శిబిరం


శిబిరం ముగింపు కార్యక్రమంలో సభ్యులు, క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో బాల్ బ్యాడ్మింటన్ సబ్‌జూనియర్, సీనియ ర్ జట్లకు పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌మోద్దీన్, సాకే వెంకటేశులు ఆయా జట్లలోని క్రీడాకారులకు డ్రె స్సులు పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న జట్లు ప్రకాశం జిల్లా చెవ్వూరులో ఈనెల 29 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కంబదూరు గ్రామానికి చెందిన ప్రకాశ్ అక్కడి పోలీస్‌స్టేషన్‌లోనే ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం జరిగింది. కంబదూరుకి చెందిన ప్రకాశ్ వద్ద టెట్రా ప్యాకెట్లు దొరడంతో పోలీసులు సోమవారం అతడిని పట్టుకుని వచ్చారు. మంగళవారం స్టేషన్‌కు ప్రకాశ్‌ను పిలిపించారు. అంతలోనే ప్రకాశ్ స్టేషన్‌లో ఉన్న కిచెన్ రూమ్‌లోకి వెళ్లి ఓ పదునైన కత్తిని తీసుకుని తన ఎడమ చేతిని కోసుకున్నాడు. దీన్ని గమనించిన ఓ కానిస్టేబుల్ సహచర పోలీస్ సిబ్బంది సాయంతో అతడిని కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అధిక రక్తస్రావం కావడంతో ప్రకాశ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు ఈ ఘటనను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ విషయమై కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్‌ను వివరణ కోరగా అరెస్టు చేస్తారని పోలీసులనే భయపెట్టడానికే ఇలా ఆత్మహత్యకు యత్నించాడన్నారు. ప్రకాశ్‌పై గతంలో కర్ణాటక మద్యం కేసులో 2 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటి తలుపులు బద్దలు కొట్టి చోరీ

అనంతపురం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శనగర్‌లో సోమవారం రాత్రి ఓ ఇంటి తలుపులు బద్దలు కొట్టి దుండగులు చోరీ చేశారు. అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో బాబు అనే ఆటోడ్రైవర్ నివాసం ఉంటున్నాడు. ఏదో పనిపై సొంతూరు రామగిరికి వెళ్లాడు. ఇది గమనించిన దుండగులు రాత్రి ఇంటికి ఉన్న ఐరన్ గేట్ లాక్‌ను తొలగించారు. చెక్క డోర్ లాక్ రాకపోవడంతో... బద్దలు కొట్టారు. శబ్దం విన్న స్థానికులు రాత్రే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే సరికి దొంగలు తమ పని కానిచ్చేశారు. దొంగలు 8 తులాల బంగారం నగలు, రూ.40 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు బాబు పేర్కొన్నాడు. దీనిపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా కేసు నమోదు చేయలేదు.

ఎస్కేయూ ఉద్యోగిపై మహిళ ఫిర్యాదు?

అనంతపురంరూరల్, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పని చేస్తున్న ఉద్యోగిపై ఓ మహిళ ఫిర్యాదు చేయడం ఆయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం సదరు ఉద్యోగిపై ఓ మహిళ దిశ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు సబంధిత ఉద్యోగ వర్గాల వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. దిశ పోలీసు స్టేషన్ నుంచి ఓ ఉన్నతస్థాయి పోలీసు అధికారి వద్దకు పంచాయితీ వెళ్లినట్లు సమాచారం. గతంలో సదరు ఉద్యోగి వర్సిటీలోని ఓ విభాగంలో పనిచేస్తున్న సమయంలోనే పలు ఫిర్యాదులు అప్పటి ఉన్నతాధికారులకు వెళ్లాయి. గత ప్రభుత్వంలో అతడిని వెనకేసుకొచ్చారన్న విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా జీతాల అంశంపై బహిరంగ లేఖ రాసి తానింతే అంటూ ప్రస్తుత అధికారులకు ఓ స్థాయి హెచ్చరికలు చేశాడు. ప్రస్తుత అధికార వర్గాల్లో కొంతమంది.. ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోకుండా అడ్డుపడ్డారని చర్చ సాగుతోంది. ఆ ఉద్యోగి ప్రమోషన్ విషయంలో కూడా విమర్శలున్నాయి. ఆ మేరకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. అయినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదంటే ఆయన పలుకుబడి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. దీంతో అతడు మరింత పేట్రేగిపోతున్నాడన్న వాదనలు వర్సిటీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. విద్యార్థినులు, మహిళా ఉద్యోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని వికృత చేష్టలకు పాల్పడినట్లు అనేకసార్లు ఫిర్యాదులు వెళ్లాయి. తాజాగా మహిళా ఉద్యోగి.. పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లడం చర్చనీయాంశమైంది.

వెలంకని ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరగనున్న వెలంకని ఆరోగ్య మాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెలంకని-లోకమాన్య తిలక్ ప్రత్యేక రైలు (01162) ఈ నెల 28న వెలంకనిలో ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4-20 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినల్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (01163) సెప్టెంబరు 7న మధ్యాహ్నం 1 గంటకు లోకమాన్యతిలక్ టెర్మినల్‌లో బయలుదేరి మంగళవారం ఉదయం 3 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. అలాగే సెప్టెంబరు 9న వెలంకని-లోకమాన్య తిలక్ ప్రత్యేక రైలు (01164) వెలంకనిలో ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 4-20 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినల్‌కు చేరుకుంటుందన్నారు. ఈరైళ్లు థానే, కల్యాణ్, లోనావాలా, పూనా, డౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, కాట్పాడి, తిరువన్నమలై, విల్లుపురం, మయిలదుతురై, నాగపట్టణం మీదుగా వెలంకనికి చేరుకుంటుందన్నారు.

న్యూస్ బాక్స్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ముదిగుబ్బలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, అధికారులు శ్రీనివాసులు, డీసీటీఓ సురేష్‌కుమార్ ఏఓ ముస్తఫాతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ దుకాణాల్లో నిల్వలో ఉన్న వ్యత్యాసం వల్ల రూ.10,63,000లక్షల విలువైన 3.95 టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా గొట్లూరు, పోతుకుంట రైతుసేవా కేంద్రాలలో ఎరువుల నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజశేఖర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాల్లో స్టాకు వ్యత్యాసం కారణంగా రూ.17,84,210 విలువ చేసే ఎరువుల విక్ర యాలను నిలిపి వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కదిరి ఏడీఏ సనావుల్లా, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి, మండల ఏఓ రవీంద్ర, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో ఉన్న ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ రంగనాయకులు, ఏఓ అబ్దుల్‌హక్ మంగళవారం తనిఖీ చేశారు. దుకాణంలో నిలువ ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

● తాడిమర్రి: మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాలను తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా నిల్వలను, ధరలను పరిశీ లించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

నంబులపూలకుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తక్కువ శ్రమ, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం అందించే మల్బరీని సాగుచేసి రైతులు లాభపడాలని టెక్నికల్ అధికారి బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహిం చారు. రైతు షబ్బానా సాగుచేసిన మల్బరీ పంటను ఆయన వ్యవసాయ అనుబంధ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంల ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, వీహెచ్ఏ, ఎంపీఈఓ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గాండ్లపెంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెక్కమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వలీ, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, సీహెచ్ఓ నగేష్, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌లో వైద్యుల నిర్లక్ష్యం: సీపీఎం



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రీ వెరిఫికేషన్ సందర్భంగా అర్హులైన దివ్యాంగులను పూర్తిస్థాయిలో పరిశీలించ కుండా అన్యాయం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి ఎంపీడీఓ సాయిమనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హత ఉన్న దివ్యాంగులకు పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం రూ.15వేలు ఇవ్వాలని, బ్యాంకులలో రుణాలు మంజూరుచేయాలని, గృహవసతి కల్పించాలని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, జేవీ రమణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మండలంలో అర్హులైన దివ్యాంగులకు పిం ఛన్ పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సీపీఎం నాయకుడు ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. పింఛన్ తొలగించడంతో అర్హులైన దివ్యాంగులు రోజూవారీ అవసరాలకు చేతిలో డబ్బులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వారి సదరం సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి తిరిగి పింఛన్ మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బండల వెంకటేష్, సీపీఎం నాయకులు గుంజేపల్లి పోతలయ్య, ఆవాజ్ కమిటీ నాయకుడు బాబ్‌జాన్ పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన

తాడిమర్రి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పార్కు ఏర్పాటుకు, శ్మశాన వాటిక కోసం తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, బీజేపీ నాయకుడు గోపాల్‌రెడ్డి మంగళవారం ప్రభుత్వ స్థలాలను పరిశీ లించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను పరిశీ లించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న స్థలాల వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పనులను ప్రారంభిస్తామని వారు తెలిపారు.

స్వమిత్వ సర్వే పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

గాండ్లపెంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పలు పంచాయతీల్లో నిర్వ హిస్తున్న స్వమిత్వ సర్వే పై డీఎల్‌డీఓ వెంకట రత్నం మంగళవారం ఆ యా గ్రామ సచివాలయా ల్లో పరిశీలించారు. కటారుపల్లి, వేపరాల పంచాయతీలోని అధికారులతో సమా వేశం నిర్వహించారు. గ్రామకంఠంలోని ఇళ్ల స్థలాల రీసర్వే ప్రక్రియను అడిగి తెలుసు కున్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంచేయాలని, తప్పులు తడకలు లేకుండా కొలతలు వేసి నివేదికలు ఉండాలన్నారు. పంచాయతీలో నెలకున్న సమస్యలపై ఆరాతీశారు. సమావేశంలో ఈఓఆర్‌డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, బాషా, శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

రక్షణ గోడలు లేని ఎగువ బ్రిడ్జి

● తరచూ ప్రమాదాలు



రక్షణ గోడలు లేని బ్రిడ్జి

నల్లమాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపర్తి గ్రామ సమీపంలో గొడ్డిచింతమాను వద్ద ఉన్న ఎగువ బ్రిడ్జికి ఇరురువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో ఆ దారివెంట రాకపోకలు సాగించే పలువురు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు, గ్రామస్థులు వాపోతున్నారు. నల్లమాడ నుంచి పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఎగువ బ్రిడ్జి రోడ్డుకు సమానంగా ఉంది. ఈ బ్రిడ్జికి ఇరువైపులా ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరడంతో పాటు రక్షణ గోడలు లేవు. దీంతో వాహన చోదకులు ఏ మాత్రం అదమరిచినా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఈ బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో మూడు రోజుల క్రితం కుటాలపల్లి తండా నుంచి పుట్టపర్తికి కూలీల వెళ్తున్న ఆటో కూడా బోల్తా పడిందన్నారు. ఈప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

గణేశ్ ఉత్సవాలకు సర్వం సిద్ధం

● వాడవాడలా భారీ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

పుట్టపర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేపట్టారు. బుధవారం గణేశ్ విగ్రహాలు ఏర్పాటుచేయాల్సి ఉండగా మంగళవారమే విగ్రహాలను ఆయా ప్రాంతాలకు చేర్చారు. జిల్లా కేంద్రంతో పాటు హిందూపురం, ధర్మవరం, కదిరి కేంద్రాలలో భారీ విగ్రహాలను నిలబెట్టడానికి ఒకరోజు ముందే వినాయక ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక పూజల్లో ఉపయోగిం చడానికి చిన్న విగ్రహాలతో పాటు పూజా సామగ్రి, పూలు, కాయలు, పండ్లు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. బుధవారం ఉదయం 7గంటలకే గణేశ్ చతుర్థి సందర్భంగా ఉత్సవ విగ్రహాలను నిలబెట్టి పూజలు చేయనున్నారు. విగ్రహాలు ఏర్పాటుచేసిన వీధీలలో భారీ ఎత్తున స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. వినాయక చవితి పండుగ జరుపుకోవడానికి ఇతర ప్రాంతాలలో ఉన్న ఉద్యోగులు, వలసలు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకున్నారు.



ధర్మవరంలో వినాయకుడిని ప్రత్యేక వాహనంలో తీసుకెళ్తున్న యువకులు

పట్టణాల్లో పండుగ సందడి



ధర్మవరంలో వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



పూజాసామగ్రి తీసుకెళ్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్/ కదిరి/ కొత్తచెరువు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పట్టణాల్లో వ్యాపారులు, కొనుగోలు దారుల సందడి నెలకొంది. ధర్మవరం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో మంగళవారం జనంతో కిటకిటలాడింది. వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తరలి రావడంతో ఎన్టీఆర్ సర్కిల్ కిక్కిరిసిపోయింది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంజుమన్‌సర్కిల్ వరకు తోపుడు బండ్ల వ్యాపారులు, జనంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. కదిరి పట్టణంలోని కాలేజీ సర్కిల్, బస్టాండ్ కూడలి, జీవిమానుసర్కిల్, టవర్‌క్లాక్ తదితర కూడళ్లలో జనంతో సందడి నెలకొంది. ఎటు చూసినా కొనుగోలుదారులతో పట్టణం కిటకిటలాడింది. ద్విచక్రవాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్ర మైన కొత్తచెరువులో నాలుగురోడ్ల కూడలిలో బుక్కపట్నం రహదారి జనంతో కిక్కిరిసి పోయింది. పట్టణం, గ్రామాలలో నెలకొల్పే వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాలు, ఎద్దులబండ్లలో తీసుకెళ్లారు.



కిటకిటలాడుతున్న కదిరిలోని కాలేజీ సర్కిల్



కొత్తచెరువులోని బుక్కపట్నం రహదారి

సకాలంలో పనులు పూర్తిచేయాలి: ఆర్డీఓ

తనకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పజెప్పిన రెవెన్యూ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలు, తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ తదితరులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కులధ్రువీకరణ పత్రాలకు సంబంధించి సుమోటోగా గుర్తించిన వారందరికి త్వరగా ధ్రువీకరణపత్రాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. భూ రీసర్వేపై నిర్లక్ష్యం వద్దన్నారు. తవళం రెవెన్యూ పొలంలో వివాదాలను సత్వరం పరిష్కరించాలన్నారు. బొంతపల్లి, తవళం రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములు అక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, ఆర్ఐ అశోక్‌చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

ముదిగుబ్బ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల కాలనీలో ప్రభుత్వ స్థలాలను ధర్మవరం ఆర్డీఓ మంగళవారం పరిశీలించారు. స్టేడియం స్థలం, ఫ్యూచర్ సీడ్స్, ప్రభుత్వ స్థలాలను పరిశీలించి ఎక్కడా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని తహసీల్దార్ నారాయణస్వామిని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన థర్డ్ పార్టీ నివేదిక ఆధారంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ కార్యాలయానికి చిత్రపటాల బహూకరణ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల గ్రామంలోని టీడీపీ కార్యాలయానికి మంగళవారం ఆ పార్టీ నాయకులు చిత్రపటాలను బహూకరించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, సీఎం చంద్రబాబు, విద్యా శాఖమంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యేలు బాలక్రిష్ణ, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి చిత్రపటాలను అందించారు. టీడీపీ నాయకులు పొగాకు జాకీర్ అహమ్మద్, చక్రధర్‌నాయుడు, వినోద్‌కుమార్‌నాయుడు, ఇడగొట్టు ఆంజనేయులు, చెన్నకేశవులు, బాలక్రిష్ణారెడ్డి, షామూన్, గంగులప్ప, బడిశం నరసింహులు, సంగాల శీనా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది మంగళవారం తహల్దార్ టి. శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది హేమలత, హరినాథ్, ఇస్మాయిల్, బాబాఫకృద్దీన్, నరసింహులు, సందీప్ మాట్లాడుతూ... 20 సంవత్సరాలుగా 108 సిబ్బంది సేవలందిస్తున్నామన్నారు. అంబులెబ్సు నిలుపుకోవడానికి, ఎమెర్జెన్సీ మెడికల్ సామాగ్రి పెట్టుకోవడానికి, తాము ఉండడానికి గదులు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాంచి, తమకు షెల్టర్ ఏర్పాటుచేయాలని కోరారు.

కల్వర్టును నిర్మించిన అధికారులు

ఆంధ్రజ్యోతికి స్పందన

కొత్తచెరువు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయ నగర్ కాలనీ ప్రధాన రహదారి పై ఉన్న కల్వర్టు దెబ్బతింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. దీనిపై 'దెబ్బతిన్న కల్వర్టు- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు' అన్న కథనం ఈనెల 8వ తేదీన ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు కల్వర్టును నిర్మంచారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయని వాహనదారులు తెలిపారు.

'ఉద్యోగ ఎంపిక అవకాశం అభ్యర్థులకే ఇవ్వాలి'

కదిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రెండు, అంతకుమించి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు వారు కోరుకునే విధంగా మార్చుకునే అవకాశం కల్పించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలమంది అభ్యర్థులు డీఎడ్, బీఎడ్ చదివారని, అలాంటి వారు రెండు అంతకుమించి ఉద్యోగులకు దరఖాస్తుచేసి సాధించారన్నారు. వారు కోరుకునే విధంగా ఆప్షన్ ఇచ్చేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయండి

● కలెక్టర్‌కు రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నరైతులు

తనకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే టమోటా పంట అత్యధికంగా సాగుచేసే తనకల్లు మండలంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేయాలని స్థానిక రైతులు.. కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మండలకేంద్రానికి వచ్చిన ఆయనను రైతులు కలిసి విన్నవించారు. ఏడాది పొడుగునా ఈ ప్రాంతంలో టమోటా సాగుచేస్తామని తెలిపారు. ధరలు లేని సమయం లో టమోటాలను రోడ్డుమీద, పొలాల్లో వదిలేయాల్సి వస్తోందన్నారు. ధరలు లేని సమయంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ప్రాసెస్ చేసి టమోటా ఉత్పత్తులు విక్రయించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సోంపాల్యం నాగభూషణం, జనసేన నాయకుడు రమణ, రైతు సంఘం నాయకుడు వెంకటరమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినాయక చవితి



దేవతామూర్తుల వేషధారణలో రిషి విద్యాలయ చిన్నారులు

ధర్మవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో మంగళవారం వినాయక చవితి వేడుకలను ముందస్తుగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'ఎవరు గొప్ప..?' అనే నాటకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన ఈశ్వరుడు, పార్వతి, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్ సింగ్, సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పీవీఎస్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగు రంగుల పూలతో అలంకరించి, మట్టి గణనాథుడి విగ్రహానికి విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వినాయకుడి రూపంలో విద్యార్థులు ఏర్పడ్డ మానవ హారం చూపరులను ఆకట్టుకుంది. పాఠశాల చైర్మన్ పీవీనాయుడు వినాయక చవితి ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గణనాథుడి రూపంలో ఏర్పడిన పీవీఎస్ విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఆర్జే రత్నాకర్, ఆర్డీఓ సువర్ణ ● మట్టి ప్రతిమల పంపిణీ



పుట్టపర్తిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. వారు మంగళవారం పట్టణవాసులకు మట్టివినాయక ప్రతిమలను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ పీసీ గంగన్న, బీజేపీ నాయకులు కత్తి రాజారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకులతో కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు

● ధర్మవరం: స్థానిక కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు మంగళవారం బంకమట్టితో గణపయ్యలను తయారుచేసి 'మట్టి గణపయ్యలనే పూజిద్దాం...పర్యావరణాన్ని కాపాడుకుందాం' అంటూ నినదించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కదిరిలో మట్టి ప్రతిమలను అందజేస్తున్న దృశ్యం

●కదిరి అర్బన్: వినాయ చవితి పండుగ సం ద ర్భంగా మంగళవారం పట్టణంలో శ్రీఖాద్రీ నరసింహ సేవా సమితి, తిరుపాల్ హో టల్, తన్విక్ మొబైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. పట్టణవాసులు సంపత్‌లక్ష్మి, అనుదీప్, హర్ష, లక్ష్మణ్, కార్తీక్, రాజేంద్ర, హరిప్రసాద్, లక్ష్మీపతి, అరవింద్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి: డీఎస్పీ

నంబులపూలకుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయచవితి పండుగను ప్రశాంతంగా, ఘర్షణలకు చోటులేకుండా జరుపుకోవాలని డీఎస్పీ శివ నారాయణస్వామి సూచించారు. ఆయన మంగళవారం నంబులపూలకుంట పోలీస్‌స్టేషన్‌లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి గొడవలకు తావివ్వరాదన్నారు. విగ్రహాల ప్రతిష్ఠించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. సీఐ నాగేంద్ర, గాండ్లపెంట ట్రైనీ ఎస్ఐ రవికుమార్, ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి, పోలీస్‌లు అన్నిమతాల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

● ధర్మవరం రూరల్: గ్రామాల్లో వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని సుబ్బరావుపేట, తుమ్మల గ్రామాల్లో ఎస్ఐ ప్రజలతో సమావేశమై సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'భూహక్కు చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి'

నంబులపూలకుంట, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు భూమలిచ్చిన రైతులకు భూహక్కు చట్టం ప్రకారం పరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మంగళవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ... ఇప్పటికే మండలంలో సోలార్ ప్రాజెక్ట్ నిర్మించారని, రైతులకు ఇంకా పరిహారం అందాల్సి ఉందన్నారు. రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు

● సమగ్రశిక్ష అధికారుల ఇష్టారాజ్యం
● యూటీఎఫ్, ఫ్యాప్టో నాయకుల విమర్శ

కొత్తచెరువు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్‌లో నిబంధనలను పాటిం చకుండా ఖాళీ పోస్టుల నియామకాలు చేపట్టి ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులకు అన్యాయం చేశారని యూటీఎఫ్, ఫ్యాప్టో నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, హరి ప్రసాద్ రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఎస్ఎస్ఏలోని పది రకాల పోస్టులకు 34 మంది ఎంపికయ్యారు. వారిలో ఒక్కొక్క రు రెండు పోస్టుల నుంచి మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎస్ఎస్ఏ అధికారులు ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్కసారి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. అయితే నిబంధనలను పాటించకుండా ఇంటర్వ్యూలను మూడు పోస్టులకు కలిపి ఒకేసారి నిర్వహించారు. దీనిప్రకారం మూడు పోస్టులకు ఒకే మార్కులు రావాలి. రకరకాలుగా మార్కులు వేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ఈ నియామకాలను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని వారు ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఉద్యమాలు చేపడుతామని వారు ప్రకటనలో హెచ్చరించారు.

ఏడోరోజు కొనసాగిన క్రికెట్ టోర్నీ



గెలుపొందిన జట్టుతో హరీశ్‌బాబు తదితరులు

ధర్మవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో అటల్ బిహారి వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 ఏడో రోజు మంగళవారం కూడా రసవత్తరంగా సాగింది. మొదట మ్యాచ్‌లో గొట్లూరు, బీకేపీ లెవన్స్ జట్లు తలపడగా 28 పరుగుల తేడాతో గొట్లూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో రాంనగర్ స్పోర్ట్స్, బడన్నపల్లి వా రియర్స్ జట్లు తలపడ్డాయి. 16 పరుగుల తేడాతో రాంనగర్ స్పోర్ట్స్ జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో రామాపురం లెవన్స్, ఎస్‌వీబాబు యూత్ జట్టు తలపడగా 98పరుగుల తేడాతో రామాపురం జట్టు గెలిచింది. ఈ మూడు మ్యాచ్‌లలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తదితరులు బహుమతులు అందజేశారు. క్రికెట్ కోచ్‌లు పృథ్వీ, రాజశేఖర్, నాయకులు పోతుకుంట రాజు, మైనార్టీ నాయకులు నబీరసూల్, చంద్రమహేశ్, బాలకృష్ణ, రవి పాల్గొన్నారు.

భూ కబ్జాలు వైసీపీ వారికే చెల్లు

టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు చేయడం, అమాయకులపై దాడులు చేయడం వైసీపీ వాళ్లకే చెల్లుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ నాయకులను విమర్శిస్తూ వైసీపీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి చేసిన విమర్శలపై వారు స్పందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వైసీపీ వారు తనను టార్గెట్ చేస్తూ తాను భూకబ్జాలకు పాల్పడుతున్నానని ఆరోపిస్తున్నారని, అయితే తాను ఎక్కడైనా భూకబ్జాలకు పాల్పడినట్లు రుజువు చేస్తే రాజకీయాలు శాశ్వతంగా వదిలేస్తానన్నారు. అసలు చేసేదంతా వైసీపీ వాళ్లేనని, అమాయకుల ఆస్థులను కబ్జాచేసి సొంతం చేసుకున్నారన్నారు. వైసీపీ నాయకులు భూకబ్జాలు ఎక్కడెక్కడ చేశారనే విషయాలను తాను రుజువు చేస్తానని, మీ కబ్జాలు నిజమని తేలితే మీరు ఏమిచేస్తారో తెలపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు గౌరీశంకర్, లక్ష్మీనరసప్ప, బాబురెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

అసత్య కథనాలపై నిరసన

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): అసత్య కథనాలను ప్రచురిస్తూ గౌరవానికి భంగం కలిగిస్తున్న జగన్‌పత్రిక తీరుని నిరసిస్తూ మంగళవారం చిలమత్తూరు మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇటీవల జగన్ పత్రికలో ఎలాంటి సంబంధం లేని వార్తాకథనాలను తమపై రాస్తూ తమ పరువుకి భంగం కలిగించడం జరుగుతోందని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. టీడీపీ నాయకులపై వైసీపీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి దాడి చేశారని, అయితే ఎంపీపీపైనే టీడీపీ నాయకులు దాడి చేశారని, అందుకు సూత్రదారి వేరొకరు ఉన్నారని కథనం ప్రచురించడం జరిగిందన్నారు. ఇలాంటి కథనాలు రాసి బురదచల్లితే ఊరుకోమన్నారు. అసత్య కథనాలు రాసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐ జనార్దన్ బందోబస్తు చేపట్టారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, దేమకేతేపల్లి అంజినప్ప, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప, బాబురెడ్డి, గౌరీశంకర్, లక్ష్మీనారాయణయాదవ్, నాగరాజుస్వామి, మీసేవ సూరి, మాజీ ఎంపీటీసీ శివ, లక్ష్మీదేవమ్మ నిరసనలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో ఎంఈఓ, ఉపాధ్యాయులు

రొద్దం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కోగిర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రావణి ఎంపికైనట్లు ఎంఈఓ అరవింద్ తెలిపారు. మంగళవారం రొద్దం మండల పరిధిలోని కోగిర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ఎంపికపై ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలు జరగ్గా శ్రావణి ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఎంఈఓ తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా సత్యనేపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రావణి పాల్గొంటుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు హరికిరణ్, పీఈటీ మహేష్, ఎమ్మార్సీ సిబ్బంది రాజా, నరేష్ తదితరులు శ్రావణిని అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో నాయకులు

అమరాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో వైసీపీ నుంచి ఐదు కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో శ్రీనివాస్, విష్ణుకుమార్, శివ కుమార్, గొల్లజయప్ప, అంగడి మూడ్లిగిరి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సౌరక్క, నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ పాండురంగప్ప, పంచాయతీ అధ్యక్షుడు ఎంజీరప్ప, చంద్రప్ప పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపక పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు. కామర్స్-1, హిస్టరి-1, హిందీ-1, ఫిజికల్ ఎడ్యుకేషన్-1 పోస్టుకు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్.ఎల్.ఈ.టి ప్రాధ్యాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 5వ తేదీన ఇంటర్వ్యూను కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

'ప్రభుత్వ స్థలం కేటాయించండి'

గోరంట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 సేవలను ప్రజలకు అందించడానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని సిబ్బంది తహసీల్దార్ మారుతికి మంగళవారం వినతిపత్రం అందిచారు. గత 20 ఏళ్లుగా 108 సేవలదిస్తున్నామని, వాహనం నిలుపుకోవడానికి, అదేవిధంగా అత్యవసర మందులు నిల్వ చేసుకోవడానికి అవసరమైన వసతి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉండడానికి షెల్టర్ ఏర్పాటుచేయాలని కోరారు. టీడీపీ మైనార్టీ నాయకుడు ఉమ్మర్‌ఖాన్ ఆధ్వర్యంలో 108 పైలెట్ నరసింహులు, ఈఎంటీలు నాగేంద్ర, శ్రీదేవి తహసీల్దార్‌ను కలిశారు.

బాధ్యతల స్వీకరణ

పెనుకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డీవైఈఓగా గోరంట్ల ఎంఈఓగా పనిచేస్తున్న జాన్‌రెడ్డప్ప బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న ఆయనకు పెనుకొండ డివిజన్‌లోని హెచ్ఎంలు, ఎంఈఓలు, ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు రాబట్టడానికి అందరూ కలిసి కృషిచేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో మృతి

రొళ్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కే.గొల్లహట్టి గ్రామానికి చెందిన మారన్న(35) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన పొలంలో గడ్డిని కోస్తూ విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

మార్కెట్‌కు చవితి శోభ

మండపాలకు తరలివెళ్లిన గణనాథులు

ఆకాశాన్నంటిన పూజాసామగ్రి ధరలు

నేడు వినాయక చవితి



పూలమార్కెట్‌లో సందడి



కొనుగోలుదారులతో గాంధీ సర్కిల్‌లో రద్దీ

హిందూపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో కుల మతాలకు అతీతంగా జరుపుకునే వేడుకల్లో వినాయక చవితి ఒకటి. పెద్ద పెద్ద పట్టణాల నుంచి మారుమూల గ్రామాల్లో సైతం అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా ఈ వినాయక చవితి వేడుకలను జిల్లావ్యాప్తంగా బుధవారం జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. భాద్రపదమాసం వచ్చిందంటేచాలు వినాయక చవితి సందడి మొదలవుతుంది. పిల్లలు, పెద్దలు కలిసి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఊరువాడంతా ఎంతో ఉత్సాహంగా విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మంగళవారం పండగ సరుకులు పూజాసామాగ్రి కొనుగోలుతో హిందూపురంలో మార్కెట్ కళకళలాడింది. మట్టి వినాయకులను పూజించాలనే భావన ప్రజల్లో ప్రతియేటా పెరుగుతూ వస్తోంది. దీంతో చిన్నగణపతులు ఇళ్లకు తీసుకుని వెళ్లేవారు మట్టి గణపయ్యలను ఎత్తుకెళ్లారు. దీనివల్ల నీటికాలుష్యం, గాలికాలుష్యం తగ్గించాలన్న భావన ప్రజల్లో వచ్చింది. స్వామిపూజకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు జనం తరలి రావడంతో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని పేట వీధి, జనంతో కిక్కిరిసింది.

మండపాలకు తరలిన గణనాథులు

వినాయక చవితిని పురస్కరించుకుని వీధి వీధిన ప్రతిష్ఠించే వినాయక విగ్రహాలు మంగళవారం హిందూపురం నుంచి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాలకు తరలి వెళ్లాయి. ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించిన విగ్రహాలను కోలాహలంగా తీసుకెళ్లారు.

ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

వినాయక చవితి పండగను పురస్కరించుకుని ధరలు సామాన్యులకు అందుబాటులో లేనంత విధంగా పెంచేశారు. హిందూపురం ప్రధాన మార్కెట్‌లో పూజాసామగ్రి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. మూరుపూలు రూ.100, చండుపూలు కిలో రూ.100దాటాయి. చామంతి రూ.300దాటాయి. కనకాంబరాలు రూ.వెయ్యి, ఇలా గణపతి పూజకు వాడే వెలక్కాయి ఒకటి రూ.20, సీతాఫలం రూ.20, గరక కట్ట రూ.50, అరటి పిలక ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 పలికింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఇంటి ఆడబిడ్డలకు పసుపుకుంకుమ(చీర,సారె) అందజేయడం ఆనవాయితీ. ఎండు కొబ్బరి ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి ఒక్క టెంకాయ రూ.50నుంచి రూ.70 పలికింది.

హైవేపై గుంతలు

పలుచోట్ల మలుపులు

నియంత్రించలేక

నిత్యం ప్రమాదాలు



అగ్రంపల్లి వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

మడకశిర రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొడికొండ చెక్ పోస్టు నుంచి మడకశిర మీదుగా కర్ణాటకలోని శిర వరకు ఎన్‌హెచ్ 544ఈ జాతీయ రహదారి ఉంది. మడకశిర మండలంలోని అగ్రంపల్లి నుంచి గోవిందాపురం వరకు 50 కిలో మీటర్లు దూరంలోపు అధిక చోట్ల మలుపులు ఉన్నాయి. కొన్నిచోట్ల హైవేలో గుంతలు కూడా ఏర్పడ్డాయి. వేగంగా వెళ్లే వాహనాలు మలుపులు, గుంతలు వల్ల తరచూ అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం శిర నుంచి హిందూపురం వైపు వెళుతున్న లారీ అగ్రంపల్లి వద్ద నడి రోడ్డులో ఉన్న గుంత వల్ల అదుపు తప్పి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొని బోల్తా పడింది. అదృవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్ట జరగలేదు.

గుంతలకు మరమ్మతులు చేయిస్తున్నాం

అధిక వర్షాలతో జాతీయ రహదారుల్లో కొన్నిచోట్ల రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రహదారుల్లో గుంతలు పడ్డాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రమాదకర మలుపుల వద్ద సిగ్నల్ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

- సుజిత, ఏఈ, ఎన్‌హెచ్



అగ్రంపల్లి వద్ద వేపచెట్టును ఢీకొని బోల్తాపడిన లారీ

భక్తిశ్రద్ధలతో గౌరీపూజ



ప్రత్యేక అలంకరణలో గౌరీమాత

పెనుకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గౌరమ్మ పండుగను పట్టణ ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మహిళలు ప్రతి ఇంటిలో గౌరీ మాతను ప్రతిష్ఠించి అరటిపిలకలు, మామిడితోరణాలతో అలంకరించి భక్తితో పూజలు నిర్వహించారు. పూజ అనంతరం మహిళలు చేతికి తోరలు ధరించి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక గౌరీపూజలు జరిగాయి.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గౌరీ పండుగను మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గౌరీపూజ చేయడం వల్ల సౌభాగ్యాలు నిలుస్తాయని పురోహితులు భాస్కరసేవేంద్రశర్మ తెలిపారు. ఆర్యవైశ్య మహిళలు పెద్దసంఖ్యలో గౌరీపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మడకశిర టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయ అధికారి తిమ్మప్ప, తహశీల్దార్ హసీనాబేగం, సీఐ నాగేష్‌బాబు తదితరులు తనిఖీలు నిర్వహించారు. ఎరువులు కొన్న రైతులకు సంబంధించిన బిల్లులు తదితర అంశాలపై ఎరువు దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు.

అగళి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు, తహసీల్దార్ సుబ్బారావు, ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐ శ్రీరాములు పేర్కొన్నారు. అగళి మండల వెంటకేశ్వర ట్రేడర్స్, సప్తగిరి హర్ప్, వాసవ ఫర్టిలైజర్స్, మధుడిలోని టీఎంసీ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియా వాడాలని అధికారులు సూచించారు.

రోడ్డు పనుల పరిశీలన

హిందూపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని దండురోడ్డులో చేపడుతున్న రోడ్డు పనులు మున్సిపల్ చైర్మన్ రమేష్ పరిశీలించారు. దండు రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రావెల్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటిని మంగళవారం చైర్మన్ పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రోడ్డు గుంతలుపడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరుముట్ల నాగేంద్ర, హరీష్, దుర్గానవీన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న గుండుమల

అమరాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విరుప సముద్రంలో టీడీపీ నాయకుడు మంజునాథ్ తల్లి మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా నాగోవనహళ్లి గ్రామంలో టీడీపీ నాయకుడు కృష్ణప్ప మృతిచెందగా నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, ఉన్నారు.

పనులను పరిశీలించిన కలెక్టర్



పనులను పరిశీలిస్తున్న టీఎస్ చేతన్

గోరంట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనులను కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో చర్చించారు. ఆయనతోపాటు జాతీయ రహదారి డీఈ గిడ్డయ్య, జేఈ కావ్య, కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సవానికి తరలిన భక్తులు

గుడిబండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రాంతం చళికె తాలూకా గౌడచంద్ర గ్రామంలో వెలసిన గౌడ చంద్రమారమ్మ ఉత్సవానికి మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, గుడిబండ దిన్నేహట్టి, మందలపల్లి, కొంకల్లు తదితర గ్రామాల్లోని భక్తులు మంగళవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ప్రతి యేడాది నిర్వహించే గౌడ చంద్ర మారెమ్మ ఉత్సవారికి గ్రామస్థులు తరలివెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకుంటే దీర్ఘకాలిక రోగాలు నయమై, తమ కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

టీడీపీ శ్రేణుల సంబరాలు

హిందూపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 50ఏళ్ల సుదీర్ఘ సినీప్రస్థానం పూర్తిచేసుకున్న బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణ కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఎంపికైన తొలి నటుడిగా బాలయ్య నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన ఓ వైపు సినిమాల్లో రాణిస్తూ మరోవైపు రాజకీయాల్లో కూడా తమవంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షఫీ, అమర్నాథ్, మంగేష్, చంద్ర, రవీంద్రనాయుడు, సుమోశీన, హెచ్ఎన్‌రాము, పవన్, రాఘవేంద్ర, రమేష్, శ్రీనివాసరెడ్డి, డైమండ్‌బాబా పాల్గొన్నారు.

చిలమత్తూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించడంపై టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణయాదవ్, గౌరీశంకర్, నాగరాజుయాదవ్, బాబురెడ్డి, విశ్వనాథరెడ్డి, శివ, లక్ష్మీదేవి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



హిందూపురంలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

స్వమిత్వ సర్వేను పరిశీలించిన జేసీ



సర్వే బృందానికి సూచనలు ఇస్తున్న జేసీ

సోమందేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న స్వమిత్వ సర్వేను మంగళవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. గ్రామకంఠంలోని ఇల్లు, ఖాళీ స్థలాలపై ప్రజలు యాజమాన్య హక్కులు కల్పించేందుకు స్వమిత్వ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ దిశలో మండలంలోని గుడిపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ సరిహద్దుల నిర్ణయంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సోమందేపల్లిలోని శివనగర్‌లో గ్రామకంఠంలో నిర్మించిన గృహాలను పరిశీలించారు. రోడ్లు, భవనాలు, నాలాలు, ఖాళీ స్థలాలను సర్వేచేసి అందులోని నిర్మాణాలను గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేపూర్తిచేసుకున్న వాటికి యాజమాన్య హక్కుపత్రాలను అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం ప్రారంభమైనా సర్వే అర్ధాంతరంగా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సర్వేయర్లతో కూడిన బృందాన్ని గ్రామకంఠంలో సర్వేలకు నియమించింది. ఈ దిశలో ఆయా సర్వేకు సంబంధించి సర్వేయర్లకు జేసీ దిశానిర్దేశం చేశారు. ఈ సర్వేద్వారా పంచాయతీకి చెందిన ఆస్తుల వివరాలపై స్పష్టత రానుంది. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, డీఎల్‌పీఓ శివనారాయణ, కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభాలు

శాస్త్రవేత్త డాక్టర్ రమ్య

అగళి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మల్బరీ తోటల పెంపకంతోనే రైతులకు అధిక లాభాలు వస్తాయని సిరికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, జిల్లా సిరికల్చర్ జేడీ శోభరాణి, ఆర్ఎస్ఆర్ఎస్ డైరెక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. అగళి మండలం దాసేగౌడనహళ్లి గ్రామంలో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏడీ హనుమంతరాయప్ప ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మల్బరీ తోటలు పెంచుకోవడంవల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటి పెంపకానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అగళి మండలంలో 300 మంది రైతులు 480 హెక్టార్లలో మల్బరీ తోటలు సాగుచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మల్బరీ పంట వేసినప్పటి నుంచి కోతకు వచ్చేంతవరకు అన్నిరకాల సదుపాయాలు అందిస్తుందన్నారు. వీటి పెంపకం, ఆకు నాణ్యత, రోగాల నివారణ, పట్టుపురుగుకు వచ్చే రోగాల గురించి పలు సూచనలు అందించారు. అవగాహన సదస్సులో మడకశిర సిరికల్చర్ ఏడీ హనుమంతరాయప్ప ఎస్ఓ నవీన్, నాగరాజు, జయరాం, మల్లప్ప, ముడ్లగిరియప్ప, గురుమూర్తి, మల్లికార్జున, నాగరాజు, సునీల్, పట్టు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పెనుకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో వన్‌స్టాఫ్ సెంటర్‌పై మంగళవారం అవగాహనసదస్సు నిర్వహించారు. శిశుసంక్షేమశాఖ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు శకుంతల, హసీన ఆధ్వర్యంలో బేటీబచావ్ బేటీపడావ్, హెల్ప్‌లైన్ తదితరవాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు విజయలక్ష్మీ, శ్రీకళ, శ్రవంతి, జయప్రకాశ్, ఎన్ఎస్ఎస్ పీఓలు శివన్న, రవికుమార్, శ్రీలేఖ పాల్గొన్నారు.

ముగిసిన కుట్టు శిక్షణ

పరిగి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటకూరులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ మంగళవారం ముగిసింది. 80 మంది మహిళలు శిక్షణ పొందారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు చెన్నకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, శాసనకోట వెంకటేష్, సంజీవరాయప్ప పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రొళ్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాగరమణ బదిలీపై చిత్తూరు జిల్లా మనదపల్లికు వెళ్లారు. రొళ్ల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన చేతన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ముమ్మరంగా ఆర్‌ఓబీ పనులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కియ సమీపంలో వేగవంతంగా ఆర్ఓబీ పనులు ప్రారంభమయ్యాయి. హరిపురం వైజంక్షన్ సమీపంలో కియ అనుబంధ పరిశ్రమలకు అవసరమయ్యే విడిభాగాలు తరలించేందుకు జాతీయరహదారిపై తరలిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కియ ఇండియా వారు జాతీయరహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరడంతో ప్రభుత్వం రూ.90కోట్లతో జాతీయరహదారిపై కియ నుంచి దుద్దేబండ సమీపంలో వెలసిన అనుబంధ పరిశ్రమలకు ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది.